# చరిత్రకెక్కిన చరితార్థులు

# యాజ్ఞవల్క్యమహర్షి

**- వాసంతి మాఘుపు.**

ఓం అస్మద్గురుభ్యోనమ: భారతదేశము వేదభూమిగా మానవాళి మనుగడకు వలసిన ఎన్నో ఎన్నెన్నో నియమములను, సూత్రములను ఉపనిషత్తులద్వారా, పురాణములద్వారా, ఇతిహాసములద్వారా, ఇంకా మరెన్నో విధములుగా మనకు అందజేసారు. వేదములను అర్థముచేసుకోలేనివారికి ఉపనిషత్తులు, అది అర్థము చేసుకోలేనివారికి ఇతిహాసములు ఇలా అన్ని తరగతులవారికి ఉపయుక్తమయ్యేవిధముగా మన మహర్షులు గురుపరంపరద్వారా ఆ విజ్ఞానాన్ని అందిస్తున్నారు. అలాంటి మహర్షులకోవలో ఒకరైన యాజ్ఞవల్క్యమహర్షిగారిని గురించి, వారు మనకు అందించిన అతి విలువైన సంపదను గురించి ఈ వ్యాసములో క్లుప్తముగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

పూర్వము కురుపాంచాలదేశములోని చమత్కారపురము వేదవిదులకు నిలయము. ఆ ప్రదేశములో నాలుగు వేదములలోను, నాలుగు ఉపవేదములలోను, షడాంగములలోను పండితుడైన బ్రహ్మరాతమహర్షి ఆశ్రమము ఉండేది. బ్రహ్మరాతమహర్షి క్రతువులకు మూలమైన వేదవాఙ్మయాన్ని అధ్యయనము చేస్తూ, యజ్ఞయాగాదులను నిత్యమూ నిర్వహిస్తూ ఉండడముచేత యజ్ఞవల్కి అని పిలువబడేవాడు. ఆయన భార్య సునంద. ప్రతివారూ దేవఋణం, మనుష్యఋణం మరియు పితృదేవతల ఋణం తీర్చుకోవాలనేది మన సంప్రదాయము. యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించడం ద్వారా దేవఋణమును; వేదవిద్యను బోధిస్తూ, దానధర్మములను ఆచరిస్తూ మనుష్యఋణమును తీర్చుకున్నాడు. కాని, వంశమును కొనసాగిస్తేగాని పితృదేవతల ఋణము తీరదు. సంతానము పొందడానికి పరమేశ్వరుని కొఱకు ద్వాదశ వత్సరములు (పన్నెండు సంవత్సరములు) ఘోరమైన తపస్సును సాగించి, పరమేశ్వరుని అనుగ్రహముపొంది, "లోకానికి బ్రహ్మతత్త్వాన్ని ప్రబోధించగల పుత్రుడు జన్మిస్తాడని" వరమును పొంది, ఆశ్రమానికి తిరిగివచ్చాడు. ఆ విధముగా సునంద, బ్రహ్మరాతమహర్షుల సంతానముగా యాజ్ఞవల్క్యుడు జన్మించాడు.

చిన్నతనమునుంచి చురుకుదనము, ధీశక్తి కలిగిన యాజ్ఞవల్క్యుడు అందరి మన్ననలకు పాత్రుడౌతున్నాడు. బ్రహ్మరాత మహర్షి తానే స్వయముగా బ్రాహ్మణోత్తముల సమక్షంలో గాయత్రి మంత్రమును ఉపదేశించి యాజ్ఞవల్క్యునకు ఉపనయనము జరిపించాడు. తరువాత వేదాధ్యయమునకు వ్యాసభగవానునివద్దకు పంపవలెనని సునంద, బ్రహ్మరాత మహర్షులు నిర్ణయించారు. ఒక శుభముహూర్తాన యాజ్ఞవల్క్యుని తోడ్కొని బ్రహ్మరాత మహర్షి వ్యాసభగవానుని సందర్శించి, యాజ్ఞవల్క్యునికి వేదవిద్యను అనుగ్రహించమని అర్థించాడు. వ్యాసుడు అంగీకరించాడు. అనంతరము యాజ్ఞవల్క్యుడు బాష్కలుని వద్ద ఋగ్వేదము, జైమిని మహర్షివద్ద సామవేదాన్ని, ఉద్దాలక మహర్షి వద్ద అథర్వవేదాన్ని అచిరకాలములోనే అధ్యయనం చేసాడు. అటుపిమ్మట యజుర్వేద

అధ్యయనానికి శాకల్యమహర్షి వద్దకు వెళ్ళాడు.శాకల్యుడు యాజ్ఞవల్క్యుని శిష్యునిగా స్వీకరించాడు. అధ్యయనము మొదలుపెట్టిన కొద్దిరోజులలోనే యాజ్ఞవల్క్యుడు మిగిలిన శిష్యులను అధిగమించి, మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు.

*మహారాజు యాజ్ఞవల్క్యుని తిలకించి, అతనిని హేళనచేస్తూ, నీవంటి వాని మంత్రములచే నా వ్యాధి తగ్గుతుందా? ఆ జలాన్ని నీకిష్టమొచ్చినట్లు చేసుకో, కాని నాకు వలదని తూలనాడగా, యాజ్ఞవల్క్యుడు కోపముతో ఆ జలమును ఆ రాజుగారి అశ్వశాలలోని ఒక రాటపై (రాట అనగా ఎండిపోయిన కొయ్య, పశువులను కట్టడానికి ఉపయోగపడే కొయ్య) పోసి వెళ్ళిపోయెను. రాజుగారి పరివారములోని జనులను ఆశ్చర్యపరుస్తూ ఆ రాట చిగురించింది.*

శాకల్యుని ఆశ్రమము సుప్రియుడనే పేరుగల రాజు పాలిస్తున్న రాజ్యములోనుండేది. పూర్వపు రోజులలో ఆశ్రమముల బాధ్యత అంతా రాజులపైనే ఉండేది. పైగా శాకల్యుడు రాజపురోహితుడు కూడా కావడముతో, శాకల్యునిపై రాజుకు అమితమైన శ్రద్ధాసక్తులు ఉండేవి. ఒకసారి రోగము బారిన పడిన రాజు, రోజుకొక విద్యార్థిచే మంత్రజలము పంపించమని శాకల్యుని అర్థించగా, శాకల్యుడు తన శిష్యులచే మంత్రజలము పంపించసాగెను. ఆ క్రమములో ఒకరోజు యాజ్ఞవల్క్యుని వంతు వచ్చెను. యాజ్ఞవల్క్యుడు ప్రతిరోజుకంటె ముందుగానే మేల్కొని, గాయత్రీ మంత్రజపాన్ని చేసి, రోగ నివారణార్థం అథర్వణవేదములోని కొన్ని మంత్రములు జపించి, మహారాజుకు మంత్రజలము, అక్షతలు తీసికొని పోయెను. మహారాజు యాజ్ఞవల్క్యుని తిలకించి, అతనిని హేళనచేస్తూ, నీవంటి వాని మంత్రములచే నా వ్యాధి తగ్గుతుందా? ఆ జలాన్ని నీకిష్టమొచ్చినట్లు చేసుకో, కాని నాకు వలదని తూలనాడగా, యాజ్ఞవల్క్యుడు కోపముతో ఆ జలమును ఆ రాజుగారి అశ్వశాలలోని ఒక రాటపై (రాట అనగా ఎండిపోయిన కొయ్య, పశువులను కట్టడానికి ఉపయోగపడే కొయ్య) పోసి వెళ్ళిపోయెను. రాజుగారి పరివారములోని జనులను ఆశ్చర్యపరుస్తూ ఆ రాట చిగురించింది. ఈ విషయము తెలిసిన రాజుగారు ఆశ్చర్యపడి, తన తొందరపాటుకు కాస్త చింతించి, మరుసటిరోజు కూడా యాజ్ఞవల్క్యునే పంపమని శాకల్యునికి కబురుచేసారు.

శాకల్యుడు యాజ్ఞవల్క్యుని పిలిపించి మరునాడు కూడా మహారాజుకు మంత్రజలం తీసుకుని వెళ్ళవలసినదిగా ఆజ్ఞాపించాడు. యాజ్ఞవల్క్యుడు నిరాకరిస్తూ, మహారాజు తనను చాలా చులకన చేసి మాట్లాడెనని, అది వివేకవంతుడైన రాజు చేయదగని పని అని, చేసిన తప్పుకు ఫలితం అనుభవించడములో సామాన్యునకు మహారాజునకు తేడా ఉండరాదని తెలియజేసెను. మహారాజు ఆజ్ఞను దిక్కరించడం ఆశ్రమమునకు మంచిది కాదని శాకల్యుడు వివరించిననూ, యాజ్ఞవల్క్యుని నిర్ణయము మారలేదు. శాకల్యుడు ఆగ్రహము కలిగి, యాజ్ఞవల్క్యుడు గురు ధిక్కారము చేసినందుకు తనవద్ద నేర్చుకున్న విద్యలను క్రక్కివేయుమని ఆజ్ఞాపించెను. యాజ్ఞవల్క్యుడు తాను శాకల్యుని వద్ద నేర్చుకున్న వేదవిద్యను అగ్ని కణముల రూపములో క్రక్కివేసెను. శాకల్యుడు అనూహ్యమైన ఆ సంఘటనకు దిగ్భ్రాంతిని చెంది వేదవ్యాసుని తలచుకొనగా, వ్యాసభగవానుడు ప్రత్యక్షమై, శాకల్యుని శిష్యులను తిత్తిరి పక్షులుగా చేసి, వారిచే ఆ వేదవాఙ్మయాన్ని భక్షింపజేసెను. ఆవిధముగా తైత్రేయోపనిషత్ ఆవిర్భవించింది.

శాకల్యుని ఆశ్రమమును విడిచిపెట్టిన యాజ్ఞవల్క్యుడు హిమాలయ ప్రాంతములో హాటకేశ్వరము వద్ద గాయత్రీదేవి కొఱకు జపము చేయగా, ఆమె వేదవిజ్ఞానమునకై సూర్యభగవానుని ప్రార్థించుమని తెలిపెను. గతములో సోమకాసురునికి అందకుండా సూర్యుడు వేదములలో కొంతభాగాన్ని దాచి ఉంచిన విషయమును యాజ్ఞవల్క్యునికి తెలియజేయగ, యాజ్ఞవల్క్యుడు భాస్కరునికై ధ్యానము చేసి, ఆయన అనుగ్రహముతో శుక్ల యజుర్వేదమును అధ్యయనము చేశాడు. తరువాత వాగ్దేవి అనుగ్రహమును పొంది, గంగా తీరములో ఆశ్రమమును నిర్మించుకొనెను. కణ్వుడు అనే శిష్యునితో మొదలుపెట్టిన ఆశ్రమము, అచిరకాలములోనే ఎందరో విద్యార్థులకు ఆశ్రయమిచ్చింది. ఋగ్వేదము, సామవేదము, అధర్వణవేదములను ఎందరెందరో విద్యార్థులు అధ్యయనము చేస్తున్నారు. శుక్లయజుర్వేదమును మాత్రము ప్రత్యేకమైన శ్రద్ధతో యాజ్ఞవల్క్యుడు పదిహేను శాఖలుగా ఏర్పరచి, కణ్వునితో పాటు మరొక పద్నాలుగు మంది శిష్యులకు ఆ శాఖలను బోధించాడు. ఆ శాఖలు ఆ శిష్యుల పేరుమీదుగా కణ్వశాఖ, మాధ్యందిన శాఖ, పరాశర శాఖ మొదలైన పేర్లతో పిలువబడుతున్నాయి.

యాజ్ఞవల్క్యుని పేరు పండితలలో సంచలనాన్ని కలిగించసాగింది. యాజ్ఞవల్క్యుడు కాత్యాయనిని వివాహము చేసికొన్నాడు. యాజ్ఞవల్క్యుడు గృహస్థాశ్రమములో దానధర్మములను, యజ్ఞయాగాది క్రతువులను నిర్వహిస్తూ తండ్రి వలన సంక్రమించిన పేరును సార్థకము అయ్యేట్లు నడుచుకోసాగాడు. తనకు సూర్యునివలన అనుగ్రహింపబడిన శుక్ల యజుర్వేదమును మహర్షులందరికి విశదపరచడానికై నిర్ణయించుకుని, కురుపాంచాలదేశంలోని మహర్షులందరిని వారి శిష్యగణముతో కూడి రమ్మని ఆహ్వానములు పంపించాడు. ఎందరో బ్రాహ్మణుల సమక్షములో అతని గురువులు, గురుతుల్యులైన పెద్దల సమక్షములో యజ్ఞమును ప్రారంభించాడు.

యజ్ఞాన్ని సక్రమముగా జరుగకుండా చేసి, యాజ్ఞవల్క్యుని అవమానించాలని, శాకల్యుడు - ఆ యజ్ఞాన్ని తిలకించడానికి వచ్చిన బ్రాహ్మణోత్తములనుద్దేశించి "యాజ్ఞవల్క్యుడు తనకు తెలిసిన తాంత్రిక విద్యద్వారా మనలను వశముచేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. వీటిని సహించరాదని, గతములో కూడా యాజ్ఞవల్క్యుడు తనకు తెలిసిన తాంత్రికపద్ధతులతో జనులను ఆకట్టుకోజూసాడని" తెలియజేసాడు. శాకల్యుని మాటలు విన్న బ్రాహ్మణులు, మహర్షులు యాజ్ఞవల్క్యుడు పఠిస్తున్న మంత్రములు ఏ వేదములోనివో, ఎవరి వద్ద నేర్చుకున్నాడో తెలుసుకోగోరగ, యాజ్ఞవల్క్యుడు వారందరికీ నమస్కరించి, ఆ మంత్రములు శుక్లయజుర్వేదములోనివని, వాటిని సూర్యభగవానుని నుండి గ్రహించితినని తెలుపగా, శాకల్యుడు శిష్యులతోగూడి అవహేళన చేసెను. తరువాత యజ్ఞమునకు హాజరైన మహర్షులు కల్పించుకుని, యాజ్ఞవల్క్యుని అనేకమైన ప్రశ్నలను అడుగగా, యాజ్ఞవల్క్యుడునూ ఎంతో సహనముతో వారి ప్రశ్నలకు సమాధానములను తెలియజేసెను. పిదప మహర్షులు యాజ్ఞవల్క్యుడు సూర్యుని నుండి వేదవిద్యను గ్రహించినాడు అనడానికి సంశయము ఏమాత్రమూ లేదని తీర్మానించారు. ఆ విధముగా క్రతువు నిర్వహించే పద్ధతి విశ్వవ్యాప్తమయ్యింది. శుక్లయజుర్వేదములోని ఈశావాశ్యోపనిషత్ యాజ్ఞవల్క్యమహర్షి మనకి అందించిన వరము.

**ఓం పూర్ణమద: పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే। పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥ ఓం శాంతి: శాంతి: శాంతి:**

జనక మహారాజు మిథిలానగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్నరోజులవి. ఆయన యాజ్ఞవల్క్యమహర్షి గురించి విని, ఆయనను సాదరముగా మిథిలకు ఆహ్వానించాడు. పత్నీసమేతముగా యాజ్ఞవల్క్యమహర్షి మిథిలలో ప్రవేశించాడు. ఈ సందర్భములో మైత్రేయి యాజ్ఞవల్క్యుని చూసే అవకాశము తటస్థించింది. మైత్రేయి, తన పినతల్లి గార్గి ప్రభావముచేత వేదవిజ్ఞానముపై చక్కని అవగాహన కలిగి, యాజ్ఞవల్క్యమహర్షిని చూడవలెనని ఆతృతపడసాగెను. ఇంతలో జనకుడు సభను ఏర్పాటుచేసి, అతడు అడిగిన ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు సమాధానములు తెలియజేసి, జనకుని ఆనందింపజేయగా, తనకు బ్రహ్మోపదేశాన్ని చేయుమని జనకుడు యాజ్ఞవల్క్యుని ప్రార్థించెను. అంతట యాజ్ఞవల్క్యుడు జనకునితో వేదాంతచర్చలు జరిపించమని, అందులో విజేతను గురువుగా స్వీకరించుమని సూచించగా, జనకుడు అటులనే వేదాంతచర్చలకు ఆహ్వానములు పంపెను. ఆ చర్చలకు శాకల్యుడు మొదలైన పండితులు, బ్రహ్మవాదిని అయిన గార్గి, మైత్రేయి కూడా పాల్గొన్నారు. అక్కడ చేరిన పండిత సమూహమునుద్దేశించి - వారిలో అధికులమని అనుకునేవారు ముందుకువచ్చి, వేయి గోవులను కానుకగా తీసికొనిపోవచ్చునని, ఈ సందర్భములో ఎవరైనా వారిని ప్రశ్నిస్తే సమాధానము చెప్పి మెప్పించాలని జనకుడు ప్రకటించెను.

పండితజనులలో పెక్కుమందిని ఆశ్చర్యపరుస్తూ యాజ్ఞవల్క్యుడు ముందుకు రావడం, ఈ సభలోని అందరికన్నా నీవు అగ్రపూజ్యుడవని అనుకోడానికి నీకున్న అర్హతలేమిటని అశ్వలుడు ప్రశ్నించగా, అది గర్వముతో చేసిన పని కాదని, నిత్యమూ క్రతువులను నిర్వహించే తనకు గోవులు అవసరమని, మహారాజు చెప్పిన విధముగా సభలో ఏవరైనా బ్రహ్మిష్టులుంటే గోవులను తప్పకుండా తోలుకొని పోవచ్చని తెలియజేసాడు. అప్పుడు ఎదురునిలిచిన పండితులనందరినీ తన సమాధానములతో మెప్పించగా, చివరకు గార్గి తన ప్రశ్నలకు సమాధానములు చెప్పుమని ముందుకు రాగా, అమె ప్రశ్నలకు కూడా యాజ్ఞవల్క్యుడు సమాధానములు చెప్పెను. అప్పుడు గార్గి యాజ్ఞవల్క్యుని ప్రతిభను కొనియాడెను. దీనిని అంగీకరించక శాకల్యుడు యాజ్ఞవల్క్యునితో సవాలుచేసి, ఓడి, ముందుకుదుర్చుకున్న షరతుల మేరకు ప్రాణము కోల్పోయెను. కాని జనకుని విన్నపముననుసరించి, ఆ కొలువులో బ్రహ్మహత్య జరుగరాదని తలచి, శాకల్యుని పునర్జీవితునిగా చేసెను. జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

తరువాత కాత్యాయని అంగీకారముతో యాజ్ఞవల్క్యుడు మైత్రేయిని వివాహమాడాడు. యాజ్ఞవల్క్యుడు గురువుగా జనకుడు నూతన విషయములను తెలుసుకుంటూ, అతనికి ఎన్నెన్నో కానుకలను సమర్పిస్తూ, చివరకు రాజ్య సహితముగా ఆత్మార్పణము చేసుకొనగా, యాజ్ఞవల్క్యుడు అతనిని అనుగ్రహించి, తన ప్రతినిధిగా రాజ్యపాలన చేయుమని చెప్పెను. యాజ్ఞవల్క్యుడు శుక్లయజుర్వేదమునకు అర్థమును తన శతపథ బ్రాహ్మణ రచన ద్వారా తెలియజేసాడు. వివిధ వర్ణములు, ఆశ్రమ ధర్మాలు, అచారవ్యవహారములు, ప్రాయశ్చిత్తములు, విధులను తెలియజేస్తూ యాజ్ఞవల్క్యస్మృతిని మానవాళికి కానుకగా అందించాడు. యోగవిద్యలను 'యాజ్ఞవల్క్యగీత'గా గార్గికి ప్రసాదించాడు. వానప్రస్థాశ్రమమును స్వీకరించి, అతనితో పాటు వనములకు వచ్చిన జనకుడు, గార్గి మొదలైనవారి సందేహనివృత్తి చేస్తూ బృహదారణ్యకోపనిషత్‌ను మనకి అందజేసాడు.

**అసతోమాసద్గమయ; తమసోమా జ్యోతిర్గమయ; మృత్యోర్మా అమృతం గమయ; ఓం శాంతి: శాంతి: శాంతి:**